సాక్షి యాదాద్రి భువనగిరి

గురువారం : 13 : మార్చి : 2025



అభివృద్ధికి ప్రతిపాదనలు

ఎంజీయూ అభివృద్ధికి రూ.309.65 కోట్లతో ప్రతిపాదనలు పంపామని వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. - 8లో



దొంగల ముఠా అరెస్ట్

రెండు తెలుగు రాష్ట్రాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను దేవరకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-31 (గురువారం సా॥)

సహర్ 5-03 (శుక్రవారం ఉ॥)

న్యూస్‌రీల్

40.3 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత

- బొమ్మలరామారంలో ఎల్లో అలర్ట్ జారీ

భువనగిరిటౌన్: వారం రోజుల క్రితం వరకు మామూలుగానే ఉన్న ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరగడంతో ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. నాలుగు రోజుల క్రితం వరకు 36 నుంచి 37 డిగ్రీలున్న ఉష్ణోగ్రత 40.3 డిగ్రీలకు చేరడంతో మధ్యాహ్నం సమయంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉండడంతో తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. బొమ్మలరామారం మండలంలో బుధవారం 40.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. కాగా.. రాజాపేటలో 39.1, నారాయణపురంలో 38.7, ఆలేరులో 38.5, అడ్డగూడూరులో 38.4, గుండాలలో 38.3, చౌటుప్పల్‌లో 38.2, బీబీనగర్‌లో 38.1, మోత్కూర్‌లో 38, తుర్కపల్లిలో 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

మెనూ ప్రకారం ఆహారం అందించాలి



ఎస్టీ బాలికల హాస్టల్‌లో వంట గదిని పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి: మెనూ ప్రకారం ఆహారం అందించడంతో పాటు నాణ్యత ప్రమాణాలను పాటించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. బుధవారం భువనగిరి పట్టణంలోని సింగన్నగూడెం వద్ద ఎస్టీ బాలికల కళాశాల హాస్టల్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏకాగ్రతతో చదువుకుని ఉన్నత విలువలతో తమ లక్ష్యాలను సాధించాలన్నారు. పుస్తకాలను చదివే అలవాటును పెంచుకోవాలన్నారు. హాస్టళ్లలో మెనూ పాటించకపోతే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. అంతకు ముందు వంట గదిని పరిశీలించి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందజేశారు. ఇంగ్లిష్ టు తెలుగు డిక్షనరీలను పంపిణీ చేశారు.

రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలి



మాట్లాడుతున్న మాధవిలత

భువనగిరిటౌన్: బ్యాంకు, వ్యవసాయ శాఖ సమన్వయంతో రైతులకు రుణ మార్పు, తక్కువ వడ్డీ సదుపాయంపై అవగాహన సదస్సులు నిర్వహించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్యదర్శి మాధవిలత అన్నారు. బుధవారం లీడ్ బ్యాంక్ మేనేజర్, వివిధ బ్యాంకుల మేనేజర్లు, వ్యవసాయ అధికారి గోపాల్‌తో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భువనగిరి, రామన్నపేట, రాజాపేటలోని రైతువేదికల్లో వ్యవసాయ న్యాయ సేవా శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. న్యాయ సహాయం, సలహాలు న్యాయ సేవా సంస్థల ద్వారా అందించటం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ శివరామకృష్ణ ఉన్నారు.

టెండర్ డబ్బులు చెల్లించిన వారికే ధాన్యం

- గూగుల్ మీట్‌లో మిల్లర్లతో అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సాక్షి,యాదాద్రి: 2022- 23 సంవత్సరానికి టెండర్ ధాన్యం డబ్బులు పూర్తిగా చెల్లించిన మిల్లర్లకే యాసంగి ధాన్యం కేటాయింపులు ఉంటాయని అదనపు కలెక్టర్ వీరారెడ్డి సూచించారు. బుధవారం జిల్లాలోని రైస్ మిల్లర్లు, అధికారులతో గూగుల్ మీట్ ద్వారా మాట్లాడారు. 10 మంది మిల్లర్లు ఇంకా టెండర్ ధాన్యం డబ్బులు చెల్లించలేదన్నారు. కొన్ని మిల్లుల్లో 2024-25 వానాకాలం ధాన్యం నిల్వలు లేవని సమాచారం ఉందని, వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఎంఆర్ డెలివరీ వేగవంతం చేయడానికి ప్రతి ఒక్క మిల్లర్ కమిషనర్ ఆదేశాలను పాటించాలన్నారు. బియ్యం సరఫరా పూర్తి చేయని మిల్లర్లకు ధాన్యం కేటాయింపులు చేయబోమని తెలిపారు. మిల్లర్లు ప్రభుత్వ ధాన్యాన్ని దుర్వినియోగం చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని లక్ష్మీనర్సింహ అగ్రో ఇండస్ట్రీస్ ముక్తాపూర్, ఎల్ఎస్ ఆగ్రోస్ గుండాల మిల్లుల యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఇప్పటినుంచి జిల్లా లో ఎనిమిది తనిఖీ బృందాలు ఏర్పాటుచేసి ఒక్కో కమిటీ 6 మిల్లులను చెక్ చేసి నివేదికలు ఎప్పటికప్పుడు సమర్పించాలన్నారు. సమావేశంలో జిల్లా రైస్ మిల్లర్లు, పౌర సరఫరాల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వం కరుణించేనా!

- నిధుల లేమితో ముందుకు సాగని పెండింగ్ ప్రాజెక్టులు
- పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి, బునాదిగాని కాల్వలకు విడుదల కాని నిధులు
- బస్వాపూర్ రిజర్వాయర్ భూ నిర్వాసితులకు అందని పరిహారం
- రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లోనైనా నిధులు కేటాయించాలని జిల్లా ప్రజల వేడుకోలు



సాక్షి, యాదాద్రి: ప్రభుత్వం నుంచి నిధుల మంజూరు లేక పలు పెండింగ్ ప్రాజెక్టు పనులు ముందుకు సాగడం లేదు. రీజినల్ రింగ్ రోడ్డు, ఎంఎంటీఎస్, గౌరెల్లి- కొత్తగూడెం జాతీయ రహదారి, మూసీ కాలువల ఆధునీకరణ, బస్వాపురం రిజర్వాయర్ బాధితులకు నష్ట పరిహారం, గంధమల్ల రిజర్వాయర్, రోడ్లు, ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, టూరిజం సర్క్యూట్‌కు నిధులు లేక నిలిచిపోయాయి. ఈనెల 19న చేపట్టే వార్షిక బడ్జెట్ సమావేశాల్లోనైనా ఈసారి నిధులు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

మూసీకాలువల ఆధునీకరణకు విడుదల కాని నిధులు

సాగు నీటి అవసరాలను తీర్చడానికి ప్రభుత్వం మూసీ కాలువల ఆధునీకరణకు నిధులు కేటాయించింది. ఉమ్మడి జిల్లాలోని భువనగిరి, ఆలేరు, తుంగతుర్తి, నకిరేకల్, నల్లగొండ నియోజకవర్గాల రైతులకు అదనపు సాగు నీరందించేందుకు కాలువలను మంజూరు చేశారు. ప్రధానంగా బునాదిగాని, పిల్లాయపల్లి, ధర్మారెడ్డి కాలువలను ఆధునీకరించడానికి గత సంవత్సరం ప్రభుత్వం జీవో జారీ చేసింది. పిల్లాయిపల్లి కాలువకు రూ.86.22 కోట్లు,ధర్మారెడ్డి కాలువకు రూ.123.98 కోట్లు, బునాదిగాని కాలువకు రూ.266కోట్లు మంజూరు చేస్తూ పరిపాలనా ఆమోదం తెలిపింది. కానీ ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు.

ముంపు బాధితులకు అందని నష్ట పరిహారం

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన బస్వాపూర్ రిజర్వాయర్ భూ నిర్వాసితులకు పరిహారం రాలేదు. బీఎన్ తిమ్మాపూర్ నిర్వాసితులకు రూ.109 కోట్లు పరిహారం ఇవ్వాలి. డిసెంబర్‌లో ముంపు నిర్వాసితులకు రూ.50 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. అయితే పూర్తి స్థాయిలో పరిహారం రాకపోవడంతో అధికారులు మల్లగుల్లాలు పడ్డారు. ముందుగా తక్కువ పరిహారం లభించే వారికి ఇవ్వాలని నిర్ణయం కూడా చేశారు. ఈలోపు కాలయాపన కావడంతో రూ.50 కోట్లను ఇతర ప నులకు మళ్లించారు. పరిహారం కోసం గ్రామస్తులు ఎదురు చూస్తున్నారు. దీంతోపాటు భూసేకరణ కు మరో రూ.200 కోట్లు అవసరం ఉన్నాయి. పరి హారం చెల్లిస్తే తప్ప రిజర్వాయర్‌లో నీటిని నిల్వచేసే పరిస్థితి లేదు.

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు జిల్లాకు మంజూరు కాలేదు. రాష్ట్ర వ్యాప్తంగా 55 నియోజకవర్గాలకు స్కూళ్లను మంజూరు చేసిన ప్రభుత్వం భువనగిరి, ఆలేరు నియోజకవర్గాలకు ఒక్కటి కూడా కేటాయించలేదు.

రోడ్లకు నిధుల మంజూరు ఏదీ?

జిల్లాలోని ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల్లో రోడ్లు మంజూరు చేశారు. పలు రోడ్లకు శిలాఫలకాలను కూడా వేశారు. అయితే నిధుల లేమితో కాంట్రాక్టర్లు పనులు చేయడానికి ముందుకు రావడం లేదు. ఆలేరు- కొలనుపాక రోడ్డుపై బ్రిడ్జిలు, మూసీ కాలువలపై బ్రిడ్జిలు, రాయిగిరి- మోత్కూరు రోడ్డు, చిట్యాల - భువనగిరి రోడ్డు వెడల్పు పనులు ఇలా జిల్లా వ్యాప్తంగా కోట్లాది రూపాయల విలువ చేసే రోడ్ల పనులు నిధులు లేక నిలిచిపోయాయి.

ప్రధాన సమస్యలపై ప్రస్తావిస్తా



నియోజకవర్గంలో ప్రధాన సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావిస్తా. గంధమల్ల, రోడ్లు, అభివృద్ధి పనుల కోసం నిధులు కావాలని సీఎంను కలిసి ఇప్పటికే విజ్ఞప్తి చేశా. బడ్జెట్‌లో నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

– బీర్ల ఐలయ్య, ప్రభుత్వ విప్,

నిధులు మంజూరు చేయాలని కోరుతా



భువనగిరి నియోజకవర్గంలో సాగు నీటి ప్రాజెక్టులకు నిధులు కావాల్సి ఉంది. మూసీ కాలువల ఆధునీకరణ, బస్వాపూర్ రిజర్వాయర్‌కు నిధులు కావాలి. యంగ్‌ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయాలి. అదేవిధంగా టూరిజం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతాను.

– అనిల్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే , భువనగిరి

గంధమల్లకు నిధులు వచ్చేనా

గంధమల్ల రిజర్వాయర్‌కు ఇటీవల జరిగిన కేబినెట్‌లో ఆమోదం లభించింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన ఈ రిజర్వాయర్‌కు నిధుల కొరత ఉంది. సామర్థ్యం తగ్గించి నిర్మించడానికి ప్రభుత్వం అంగీకరించింది. అయితే నిధులు కేటాయిస్తే తప్ప పనులు ప్రారంభం కావు.

టూరిజం సర్క్యూట్‌కు నిధులు అవసరం

భువనగిరి, కొలనుపాక, యాదగిరిగుట్ట, భూదాన్ పోచంపల్లి, రాయిగిరి ఇలా పలు చోట్ల టూరిజం అభివృద్ధికి నిధుల అవసరం ఉంది. ప్రపంచ టూరిజం గ్రామంగా పోచంపల్లిని మూడేళ్ల క్రితం గుర్తించారు. కానీ నిధులు కేటాయించక ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదు.


భూసేకరణకు నిధుల కొరత

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీజినల్ రింగ్‌రోడ్డు, ఎంఎంటీఎస్, గౌరెల్లి- కొత్తగూడెం జాతీయ రహదారి 330ఏ ల భూసేకరణ నిలిచిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ పూర్తి చేస్తే కేంద్రం పనులను చేపడుతుంది. ఇటీవల కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి భూసేకరణచేయాలని రాష్ట్రాన్నికోరారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం భూ సేకరణ కు తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది. బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తే ఈ ప్రాజెక్టులు ముందుకు కదిలే అవకాశం ఉంది.

ప్రణయ్ కేసు తీర్పు మార్పునకు నాంది కావాలి

- ప్రణయ్ తండ్రి బాలస్వామి అభ్యర్థనతో స్పెషల్ పీపీగా నియమించారు
- ఈ కేసులో 472 పేజీల రాత పూర్వక వాదనలు కోర్టుకు సమర్పించా
- ఏడు సుప్రీం కోర్టు జడ్జిమెంట్లను అందజేశా
- కుట్రలన్నీ కోర్టులో నిరూపణయ్యాయి

'సాక్షి'తో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దర్శనం నరసింహ



వివరాలు తెలియజేస్తున్న స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దర్శనం నరసింహ

రామగిరి(నల్లగొండ) : మిర్యాలగూడలో జరిగిన పెరుమాళ్ల ప్రణయ్ హత్య కేసు దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ కేసు సుదీర్ఘ విచారణ అనంతరం నల్లగొండ ఎస్సీ, ఎస్టీ కోర్టు ఈ నెల 10వ తేదీన ఒకరికి మరణశిక్ష, మిగతా వారికి జీవిత ఖైదు విధిస్తూ సంచలన తీర్పు వెల్లడించింది. ఈ హత్య కేసుకు సంబంధించిన ఆధారాలను సమర్థంగా కోర్టులో సమర్పించడంలో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దర్శనం నరసింహ పాత్ర కీలకం. ఈ కేసు విచారణ జరిగిన తీరును బుధవారం ఆయన 'సాక్షి'తో పంచుకున్నారు. కేసు ఎందుకు వాదించాల్సి వచ్చింది? కేసు జరుగుతున్న సమయంలో సాక్ష్యాధారాలు ఎలా సేకరించారు? తదితర వివరాలను ఆయన వెల్లడించారు.

2018 సెప్టెంబర్ 14వ తేదీన ప్రణయ్ హత్య జరిగింది. నిందితులపై కేసు నమోదు కావడం కోర్టులో హాజరు పరిచారు. నిందితులు బెయిల్‌పై విడుదల అయ్యారు. దీంతో ప్రణయ్ తండ్రి బాలస్వామి అభ్యర్థన మేరకు అప్పటి కలెక్టర్ వి.చంద్రశేఖర్ 2019డిసెంబర్ 2న ఈ కేసుకు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించారు. అప్పటికే పీడీ యాక్ట్ కేసులో జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చిన మారుతీరావు తన కూతురు అమృతవర్షిణిని బెదిరింపులకు గురిచేశాడు. దీంతో ఆయన బెయిల్ రద్దు చేయాలని అమృత కోర్టులో పిటిషన్ వేసింది. ఆ తర్వాత మారుతీరావు ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

2020లో చార్జిషీట్

ఈ కేసులో 2020డిసెంబర్ 20న కోర్టు చార్జిషీట్ నమోదు అయింది. ప్రణయ్ తండ్రి బాలస్వామి, భార్య అమృతవర్షిణి, తల్లి ప్రేమలత స్టేట్‌మెంట్, 20 రోజుల పాటు క్రాస్ ఎగ్జామినేషన్ జరిగింది. కోవిడ్ తర్వాత కేసు విచారణలో కొంత జాప్యం జరిగింది. 2022జూలై 26న జడ్జి బి.తిరుపతి బాధ్యతలు తీసుకున్నాక నిందితులతో పాటు సాక్షుల స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. 2024 జూలైలో జడ్జిగా ఎస్.రోజారమణి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సమయంలో కేసు విచారణ వేగంగా కొనసాగింది. కేసులో కోర్టుకు 102 మంది సాక్షుల పేర్లను సమర్పించగా 78 మంది సాక్షులను విచారించారు. 293 పేజీల డాక్యుమెంట్లు కోర్టుకు సమర్పించాం.

పరువు హత్యలు ఆగాలి..

ఈ కేసులో 472 పేజీల రాత పూర్వక వాదనలను, ఏడు సుప్రీం కోర్టు జడ్జిమెంట్లను కోర్టుకు సమర్పించా. 523 పేజీలతో కోర్టు తీర్పు ఇచ్చింది. డిఫెన్స్ న్యాయవాదుల వాదనలను సమర్థంగా తిప్పికొట్టి అన్ని సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించడంతో నిందితులకు కఠినశిక్షలు పడ్డాయి. ఈ తీర్పుపై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. తమిళనాడు రాష్ట్రంలోని పలు పత్రికల్లో వార్తలు ప్రచురితమయ్యాయి. అనేక డిబేట్‌లు జరుగుతున్నాయి. న్యాయ వ్యవస్థపై నమ్మకం పెరిగింది. కుల హత్యలకు పాల్పడే వారికి ఈ తీర్పు కనువిప్పునిస్తుంది. ఇప్పటికీ కుల పరమైన దాడులు, హత్యలు జరుగుతున్నాయి. అవన్నీ ఈ తీర్పుతో ఆగాలి.

5,663 మంది హాజరు

భువనగిరి: ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం సెకండియర్ గణితం- 2ఏ, బాటనీ, పొలిటికల్ సైన్స్ పేపర్- 2 పరీక్ష నిర్వహించారు. పరీక్షలకు మొత్తం 5851 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 5,663 హాజరయ్యారు. 188 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈఓ రమణి తెలిపారు.

నీటి ఎద్దడి రానీయొద్దు

- అదనపు కలెక్టర్ గంగాధర్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గంగాధర్

భువనగిరిటౌన్: వేసవిలో నీటి ఎద్దడి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ గంగాధర్ ఆదేశించారు. బుధవారం భువనగిరిలోని జెడ్పీ సమావేశ మందిరంలో జిల్లా పంచాయతీ ప్లానింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నీరు క్రమం తప్పకుండా సరఫరా అయ్యేలా చూడాలన్నారు. గత సంవత్సరం నీటి ఎద్దడి ఎదుర్కొన్న గ్రామాల్లో సమస్య పునరావృతం కాకుండా చూడాలని తెలిపారు. అన్ని గ్రామాల్లో వెంటనే బోర్లకు మరమ్మతులు, ఫ్లషింగ్ చేయించాలని ఆదేశించారు. నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురైతే స్థానికంగా నీటి సరఫరా చేసేందుకు ప్రత్యామ్నాయ కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. జెడ్పీ సీఈఓ శోభరాణి మాట్లాడుతూ.. 2025-26కు సంబంధించి 15 వ ఆర్థిక సంఘం నిధులు రాష్ట కమిషన్ సిఫార్సు మేరకు రూ.2,16,91,520 నిధులు కేటాయింపు చేసినట్లు చెప్పారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ గంగాధర్ అన్నారు. వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం జెడ్పీ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లా వైద్య, విద్య, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ, వ్యవసాయ పశుసంవర్ధక, పబ్లిక్ వర్క్స్, పర్యావరణ, కాలుష్య నివారణ, మున్సిపల్ కమిషనర్ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. కూడళ్ల వద్ద, పార్కుల వంటి స్థలాల్లో చలివేంద్రాలు ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేసి తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ, వైద్యాధికారి, జిల్లా అధికారులు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలి

నాగార్జునసాగర్ : ఎస్సీ, ఎస్టీలను బలోపేతం చేసేందుకు మెరుగైన అవకాశాలు కల్పించడంతో పాటు వారికి ప్రభుత్వ పథకాల్లో లబ్ధి చేకూర్చేందుకు రూల్‌ఆఫ్ రిజర్వేషన్ పాటించాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. బుధవారం నాగార్జునసాగర్ సందర్శనకు వచ్చిన ఆయన ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రంలో సాగునీటిశాఖ అధికారులతో పాటు తెలంగాణ జెన్‌కో, ట్రాన్స్‌కో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వారు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు విషయాలను వివరించారు. సమావేశంలో ఇంజనీర్లు, షెడ్యూల్డ్ కులాల జిల్లా ఉప సంచాలకుడు కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

పట్టాలెక్కని పనులు!

- నిర్మాణానికి నోచని ఆర్‌యూబీ, ఆర్‌ఓబీలు
- డిమాండ్ల దశలోనే కొత్త రైల్వే లైన్లు, ఇతర ప్రాజెక్టులు
- అమలుకు నోచని ఎంపీల ప్రతిపాదనలు



చిట్యాల- ఉరుమడ్ల రైల్వే క్రాసింగ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలుచోట్ల రైల్వే లెవల్ క్రాసింగ్‌ల వద్ద రోడ్ ఓవర్ బ్రిడ్జీలు (ఆర్‌వోబీ), రోడ్ అండ్ బ్రిడ్జీల (ఆర్‌యూబీ) నిర్మాణం ఏళ్ల తరబడి ప్రతిపాదనలకే పరిమితం అవుతోంది. ఏటా కేంద్ర రైల్వే బడ్జెట్ కంటే ముందు, రైల్వే బోర్డు సమావేశాల సమయంలో జిల్లాలోని ఎంపీలు ప్రతిపాదనలు ఇవ్వడం, అవి అమలుకు నోచుకోకపోవడం ఆనవాయితీగా మారుతోంది. దీంతో ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం సంభవిస్తూనే ఉంది. మరోవైపు ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఇతర మంత్రులు కొండా సురేఖ, సీతక్క, ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కడియం కావ్య ఈనెల 8వ తేదీన కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను హైదరాబాద్‌లో కలిసి విన్నవించారు. రాష్ట్రంలో పలు రైల్వే ప్రాజెక్టులకు సంబంధించిన పనులకు ఆమోదం తెలుపాలని విజ్ఞప్తి చేశారు.

నల్లగొండ ప్రాజెక్టులపై ప్రత్యేక విజ్ఞప్తి

ఉమ్మడి జిల్లాలో ఆర్‌ఓబీలు, ఆర్‌యూబీలు, ఇతర రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్ర మంత్రితో ప్రత్యేకంగా చర్చించారు. జిల్లాలో పలు రైల్వే లెవెల్ క్రాసింగ్‌ల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ ప్రమాదాలను నివారించేందుకు రైల్వే శాఖ ఆధ్వర్యంలో పూర్తిగా రైల్వే నిధులతో ఆర్‌ఓబీలను మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి లేఖ అందజేశారు. రైళ్ల రాకపోకల సమయంలో గేట్లు మూసివేయడం వల్ల ప్రధాన రహదారులపై ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తడంతో పాటు, ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ ఇబ్బందులను అధిగమించేందుకు లెవెల్ క్రాసింగ్‌ల స్థానంలో ఆర్‌ఓబీలు, ఆర్‌యూబీలు నిర్మించాలని విన్నవించారు. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా ఆయా పనులకు మోక్షం లభిస్తుందా? ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయా? అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. లేదా ఎప్పటిలాగే ప్రతిపాదనలకే పరిమితం అవుతాయా? వేచి చూడాల్సిందే.

ప్రాజెక్టులకు నిధులు వచ్చేనా?

మాచర్ల - నల్లగొండకు 92 కిలోమీటర్ల కొత్త రైల్వే లైన్ రూ.458.26 కోట్లతో మంజూరుచేసినా ఈసారి నిధులను బడ్జెట్‌లో కేటాయించలేదు. విష్ణుపురం -జాన్‌పహాడ్ 11 కిలోమీటర్ల రైల్వే లైన్‌కు డబ్బులు ఇవ్వలేదు. నల్లగొండ- శ్రీరామ్‌పురం 123వ బాక్స్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులను ఇవ్వలేదు. ఇక డోర్నకల్ - మిర్యాలగూడ కొత్త రైల్వే లైన్ పనులు సర్వేకే పరిమితమయ్యాయి. మిర్యాలగూడ, కోదాడ, నేరేడుచెర్ల, హుజూర్‌నగర్, రాజేశ్‌పురం, నేలకొండపల్లి ప్రాంతాల్లోని వ్యవసాయ, పారిశ్రామిక రంగాల వారికి ఎంతో ఉపయోగపడే ఈ లైన్ సర్వే పనులను కేంద్రం 2013-14 సంవత్సరంలో మంజూరు చేసింది. అయినా ఇంతవరకు ముందుకు సాగడం లేదు. మంత్రులు ఇటీవల కేంద్ర రైల్వే మంత్రిని కలిసిన నేపథ్యంలో ఆయా పనులకు కేంద్రం నిధులను ఇస్తుందా? లేదా? చూడాల్సి ఉంది.

ఆర్‌ఓబీ, ఆర్‌యూబీ నిర్మించాలని కోరిన ప్రాంతాలివే..

- నల్లగొండ జిల్లా రాయినిగూడెం వద్ద, తిప్పర్తి సెక్షన్‌లోని ముకుందాపురం 56వ లెవల్ క్రాసింగ్‌వద్ద, ఎఫ్‌సీఐ గోదాం నుంచి పెద్ద బండ నుంచి నామ్ రోడ్డులో 45వ లెవల్ క్రాసింగ్ వద్ద నిర్మించాలని కోరారు.
- రామన్నపేట - చిట్యాల సెక్షన్‌లోని, కి.మీ 0/4-6 వద్ద, చిట్యాల మున్సిపాలిటీ - కాటన్ రైస్ ఇండస్ట్రీస్ రోడ్‌లో, దామరచర్ల - వీర్లపాలెం రోడ్డులోని రోడ్డు 86వ క్రాసింగ్ వద్ద ఆర్‌ఓబీ లేదా ఆర్‌యూబీ నిర్మించాలని విన్నవించారు.
- త్రిపురారం - కుక్కడం రోడ్డులో, పగిడిపల్లి నుంచి నడికుడి విభాగంలోని పెద్దదేవులపల్లి వెళ్లే మార్గంలో 64వ క్రాసింగ్ వద్ద బ్రిడ్జి అవసరమని పేర్కొన్నారు.
- యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ - నాగారం రోడ్డులో, పగిడిపల్లి - భువనగిరి రోడ్డులోని రోడ్డులో, ముత్తిరెడ్డిగూడెంలో, అలేరు- పెంబర్తి రోడ్డులో, వలిగొండ - రామన్నపేట రోడ్డులో వీటిని నిర్మించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలలకు 'పీఎం శ్రీ' వరం

- అత్యున్నత ప్రమాణాలతో బోధన
- విజ్ఞానం పెంపొందించేందుకు ఫీల్డ్ విజిట్
- రెండు విడతల్లో 25 పాఠశాలల ఎంపిక



ఎక్స్‌ప్లోరర్ విజిట్‌లో భాగంగా వరంగల్‌లోని రామప్ప దేవాలయాన్ని సందర్శించిన వెల్లంకి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

రామన్నపేట : విద్యారంగంలో మార్పులు తీసుకురావడం, మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన పీఎం శ్రీ (ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకంతో అనేక ప్రయోజనాలు చేకూరుతున్నాయి. విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్య, అభ్యసన అనుభవాలను అందిస్తున్నారు. విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందించేందుకు విజ్ఞానయాత్రలకు తీసుకెళ్తున్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేస్తున్నాయి.

మొదటి దశలో ఎంపికైన స్కూళ్లు ఇవీ..

తొలి విడతలో జిల్లానుంచి 17 పాఠశాలలకు చోటు దక్కింది. ఇందులో ఆలేరు, కొలనుపాక, ఆత్మకూరు (ఎం), బస్వాపూర్, బీబీనగర్, చీకటిమామిడి, దండు మల్కాపురం, జూలూరు, రాజాపేట, వెల్లంకి, యాదగిరిగుట్ట (బాలికల) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, గుండాల, ఎం.తుర్కపల్లి, సంస్థాన్‌నారాయణపురం, భూదాన్‌పోచంపల్లి మోడల్‌స్కూళ్లు, భువనగిరి బాలుర సాంఘిక సంక్షేమ గురుకులం, చౌటుప్పల బాలికల గురుకుల పాఠశాల ఉన్నాయి.

రెండవ విడతలో..

రెండో విడతలో 8 పాఠశాలలు ఎంపికయ్యాయి. వాటిలో కోటమర్తి ఎంపీపీఎస్, ఆలేరు బాలికల గురుకులం, భువనగిరిలోని గంజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మోటకొండూరు మండలం చాడ ఎంపీపీఎస్, మోత్కూరు మండలం పాలడుగు ఎంపీయూపీఎస్, వలిగొండ మండలం ఎం.తుర్కపల్లి ఎంపీయూపీఎస్, మల్లాపూర్ ఎంపీపీఎస్, పోచంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి.

నిధులను వీటికి ఖర్చు చేస్తారు

పథకానికి ఎంపికైన పాఠశాలలకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు 60:40 శాతం నిష్పత్తిలో నిధులు మంజూరు చేస్తాయి. ఈ నిధులతో అదనపు తరగతి గదుల నిర్మాణం, ప్రయోగశాలలు, ల్యాబ్‌లలో పరికరాలను సమకూర్చడం, విద్యార్థుల ఫీల్డ్ ట్రిప్స్, ఎక్స్‌ప్లోరర్ విజిట్‌కు తీసుకు వెళ్లడం, వివిధ రంగాల్లో అనుభవజ్ఞులైన వారితో తరగతులను నిర్వహణ, బాలికల ఆత్మరక్షణకు శిక్షణ ఇప్పించడం, బాలికల సాధికారిత క్లబ్‌ల ఏర్పాటు చేస్తారు. ఎంపికైన పాఠశాలకు ఐదేళ్ల కాలానికి విద్యార్థుల సంఖ్యను బట్టి రూ.2కోట్ల వరకు ప్రభుత్వాలు ఖర్చు చేస్తాయి. ఇప్పటి వరకు ఎంపికై న పాఠశాలల ఖాతాల్లో రూ.2.50 కోట్లు జమ అయ్యాయి.

ఒక్కో పాఠశాలకు మంజూరయ్యే నిధులు ఇలా..	
250 మంది విద్యార్థుల లోపు	రూ.75వేలు
250 మంది విద్యార్థులకు పైన	రూ.1లక్ష
సీసీ కెమెరాలకు	రూ.50వేలు
వార్షిక వేడుకలకు	రూ.50వేలు
కరాటే శిక్షణకు	రూ.30వేలు
ఎక్స్‌ప్లోరల్ విజిట్ ఒక్కో విద్యార్థికి	రూ.500
క్షేత్రస్థాయి అధ్యయనం ఒక్కొక్కరికి	రూ.500
హరిత కార్యక్రమాలకు.	రూ 500
దినపత్రికలకు	రూ.12వేలు
సమీప పాఠశాలల అధ్యయనం	రూ.20వేలు
బాలికల చైతన్యానికి	రూ.5వేలు
సైన్స్ సర్కిల్ ఏర్పాటుకు	రూ.15వేలు
మ్యాథ్స్ సర్కిల్స్ ఏర్పాటుకు	రూ.15వేలు

పాఠశాలల బలోపేతానికి దోహదం



ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పథకం గ్రామీణ ప్రాంత పాఠశాలల బలోపేతానికి ఉపయోగపడుతుంది. అదేవిధంగా విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడానికి దోహదపడుతుంది. ఎక్స్‌ప్లోరర్, ఫీల్డ్ విజిట్‌ల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, విషయ పరిజ్ఞానం పెరుగుతుంది. పీఎం శ్రీ పథకాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం అయ్యేలా చూస్తున్నాం.

– సురేందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, వెల్లంకి

క్లుప్తంగా

అన్న ప్రసాదానికి రూ.5లక్షల విరాళం



ఈఓ భాస్కర్‌రావుకు చెక్కు అందజేస్తున్న కర్నాటి రమేష్, శ్రీదేవి దంపతులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో భక్తులను నిత్యాన్న ప్రసాదం అందించేందుకు గాను హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌కు చెందిన కర్నాటి రమేష్, శ్రీదేవి దంపతులు రూ.5లక్షల విరాళం ప్రకటించారు. బుధవారం స్వామి వారిని దర్శించుకున్న రమేష్, శ్రీదేవి దంపతులు ఈఓ భాస్కర్ రావును కలిసి రూ.5లక్షల చెక్కు అందజేశారు.

రామన్నపేటలో ఆరు రైళ్లను ఆపాలి

- భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ చామల

రామన్నపేట: ఐదేళ్ల క్రితం కరోనా లాక్‌డౌన్ సమయంలో రామన్నపేట రైల్వే స్టేషన్‌లో ఆగకుండా రద్దు చేసిన ఆరు రైళ్లను తిరిగి ఆపాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి లోక్‌సభలో ప్రస్తావించారు. బుధవారం లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ.. రామన్నపేట మండలంలో యాభై వేలకు పైగా జనాభా నివసిస్తున్నారని, ఇక్కడ డిగ్రీ కళాశాల, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, సబ్ కోర్టుతో పాటు అనేక ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయని, ఇక్కడ రైల్వే స్టేషన్ ద్వారా నిత్యం రైళ్లను ఆశ్రయిస్తుంటారని ప్రస్తావించారు. ప్రజల సౌకర్యార్థం రామన్నపేట రైల్వే స్టేషన్‌లో నారాయణాద్రి, ఫలక్‌నుమా, చెన్నై, శబరి, డెల్టా ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు కాచిగూడ–మిర్యాలగూడ మధ్య నడిచే డెమో రైళ్లను ఆపాలని కేంద్ర రైల్వే మంత్రిని కోరారు.

హైనా దాడిలో లేగ దూడ మృతి

చండూరు (గట్టుప్పల్): హైనా దాడి చేయడంతో లేగ దూడ మృతిచెందింది. ఈ ఘటన గట్టుప్పల్ మండలం అంతంపేట గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. అంతంపేట గ్రామానికి చెందిన భీమనపల్లి యాదయ్య తన వ్యవసాయ భూమిలో వేసిన కొట్టంలో మంగళవారం రాత్రి లేగ దూడతో పాటు మరికొన్ని మూగజీవాలను కట్టేసి రాత్రి 10 గంటల ప్రాంతంలో ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం కొట్టం వద్దకు వచ్చి చూసేసరికి లేగ దూడ మృతిచెంది కనిపించింది. హైనా దాడి చేయడంతో లేగ దూడ మృతిచెందిందని బాధిత రైతు పేర్కొన్నాడు. ఘటన జరిగిన ప్రాంతం గుట్టకు దగ్గరగా ఉండటంతో అక్కడ హైనాలు కనిపిస్తుంటాయని రైతులు చెబుతున్నారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

నకిరేకల్: నకిరేకల్ పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో బుధవారం మధ్యాహ్నం ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం గడ్డిపల్లికి చెందిన ఉరే సతీష్‌కు సూర్యాపేటకు చెందిన సాయిసుధ (29)తో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. సతీష్‌కు ఇటీవల కేతేపల్లి మండలంలోని మూసీ గురుకుల పాఠశాలలో పీఈటీగా ఉద్యోగం వచ్చింది. దీంతో సతీష్ తన భార్య సాయిసుధ, కుమార్తె, కుమారుడితో కలిసి రెండు నెలల క్రితం నకిరేకల్‌లోని డాక్టర్స్ కాలనీలో అద్దె ఇంట్లో దిగారు. రోజుమాదిరిగా బుధవారం కూడా సతీష్ పాఠశాలకు వెళ్లి మధ్యాహ్నం 3గంటల సమయంలో ఇంటికి చేరుకున్నారు. పై అంతస్తులో ఉంటున్న తన పోర్షన్‌లోకి వెళ్లి తలుపు తీసేసరికి తన భార్య సాయిసుధ గదిలోని వెంటిలేటర్‌కు చీరతో ఉరేసుకుని కనిపించింది. వెంటనే సతీష్ తన అత్తమామలకు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు వచ్చి సాయిసుధ మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- 20 తులాల బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన దేవరకొండ ఏఎస్పీ మౌనిక



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న దేవరకొండ ఏఎస్పీ మౌనిక

దేవరకొండ: రెండు తెలుగు రాష్ట్రాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరితో పాటు వారికి సహకరిస్తున్న మరో వ్యక్తిని దేవరకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 20 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను దేవరకొండ ఏఎస్పీ మౌనిక బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఏఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని టోలిచౌకి ప్రాంతానికి చెందిన షేక్ అబ్దుల్ జాఫర్ అలియాస్ అహ్మద్, అదే ప్రాంతానికి చెందిన మహ్మద్ మోసీన్ అపార్ట్‌మెంట్‌లను టార్గెట్ చేసుకొని చోరీలకు పాల్పడుతుంటారు. వీరిద్దరు ఎంత దూరమైనా స్కూటీపై ప్రయాణం చేస్తూ చోరీలు చేస్తుంటారు. దేవరకొండ పట్టణంలోని మీనాక్షి ప్లాజా అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న శీలా వాసు గత నెల 19న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లారు. అప్పటికే దేవరకొండ పట్టణానికి వచ్చిన షేక్ అబ్దుల్ జాఫర్, మహ్మద్ మోసీన్ కలిసి వాసు ఇంటికి తాళాలు వేసి ఉండడాన్ని గమనించి తాళాలు పగులగొట్టి 20 తులాల బంగారం, రూ.10వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాలతో కేసును ఛాలెంజ్‌గా తీసుకున్న దేవరకొండ పోలీసులు ఏఎస్పీ మౌనిక ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యాలను పరిశీలించి నిందితులను గుర్తించారు. ఈ నెల 11న షేక్ అబ్దుల్ జాఫర్, మహ్మద్ మోసీన్ మళ్లీ దేవరకొండకు బస్సులో వచ్చారు. వారు అనుమానాస్పదంగా కన్పించడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారని ఏఎస్పీ తెలిపారు. వీరిద్దరు ఏపీలోని విశాఖపట్నం, కర్నూల్ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్లు ఏఎస్పీ పేర్కొన్నారు. వీరు దొంగిలించిన బంగారాన్ని పాతబస్తీకి చెందిన మహ్మద్ ఫసికి అప్పగిస్తారని.. ఆ బంగారాన్ని విక్రయించగా వచ్చిన నగదును పంచుకుంటారని ఏఎస్పీ తెలిపారు. వారి నుంచి 20 తులాల బంగారం స్వాధీనం చేసుకొని ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. జాఫర్‌పై 70 కేసులున్నట్లు ఏఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించిన దేవరకొండ సీఐ నర్సింహులు, ఎస్‌లు అజ్మీరా రమేష్, నారాయణరెడ్డి, కోటేష్, కానిస్టేబుళ్లు హేమునాయక్, తిరుపతి, చాంద్‌పాషా, సతీష్, అంజి, ఇమ్రాన్, సోమ్లా, సింహాద్రిని ఏఎస్పీ అభినందించారు.

సాగర్‌ను సందర్శించిన విదేశీ మీడియా ప్రతినిధులు



బుద్ధవనంలోని మహాస్తూపం వద్ద విదేశీ మీడియా ప్రతినిధులు

నాగార్జునసాగర్: విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సహకారంతో హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మీడియా మేనేజ్‌మెంట్‌పై ఈ నెల 15వ తేదీ వరకు ఇండియన్ టెక్నికల్ అండ్ ఎకనామిక్స్ కార్పొరేషన్(ఐటీఈసీ) వారు వివిధ దేశాల మీడియా ప్రతినిధులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణలో భాగంగా నేపాల్, శ్రీలంక, గయానా, టాంజానియా, సూరినామ్ తదితర దేశాలకు చెందిన 28 మంది మీడియా ప్రతినిధులు బుధవారం నాగార్జునసాగర్‌కు వచ్చారు. సాగర్ ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం లాంచీలో నాగార్జునకొండకు వెళ్లి అక్కడ మ్యూజియంను, బుద్ధవనంలోని జాతకవనం, స్తూపపార్కు, తపోవనం తదితర ప్రాంతాలను సందర్శించారు. వీరి వెంట మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

బుద్ధవనం నిర్మాణం అద్భుతం

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



బుద్ధుడి పాదుకల వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులు

నాగార్జునసాగర్: బుద్ధవనం నిర్మాణం అద్భుతంగా ఉందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని బుధవారం ఆయన కమిషన్ సభ్యులతో కలిసి సందర్శించారు. లాంచీలో ప్రయాణించారు. బుద్ధవనంలో బుద్ధుని పాదుకల వద్ద పుష్పాంజలి ఘటించారు. సాగర్ డ్యాం, జలవిద్యుదుత్పాదన కేంద్రం, బుద్ధచరిత వనం, జాతక వనం, స్థూప వనం, మహాస్థూపం, స్థూపం అంతర్భాగంలో గల అష్టబుద్ధులను సందర్శించారు. బుద్ధవనాన్ని ప్రతిఒక్కరు సందర్శించాలని అన్నారు. వీరికి పర్యాటక శాఖ గైడ్ సత్యనారాయణ బుద్ధవనం విశేషాలు వివరించారు. ఆయన వెంట కమిషన్ సభ్యులు కుసురం నీలాదేవి, రాంబాబునాయక్, లక్ష్మీనారాయణ, శంకర్, బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర, నల్లగొండ జిల్లా ఎస్సీ సంక్షేమశాఖ పీడీ కోటేశ్వర్ రావు, స్థానిక ఎస్‌ఐ సంపత్‌గౌడ్, ఆర్‌ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి బలవన్మరణం



రాజు (ఫైల్)

చిట్యాల: ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో జరిగింది. బుధవారం ఎస్‌ఐ ఎన్. ధర్మా తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దకాపర్తి గ్రామానికి చెందిన ఆలకుంట్ల రాజు(27) తన భార్య సద్గుణ, ఇద్దరు పిల్లలతో కలిసి కొంతకాలంగా హైదరాబాద్‌లోని బోరబండలో నివాసముంటున్నాడు. అక్కడ డ్రిల్లింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం పెద్దకాపర్తి గ్రామంలో జరిగిన తిరుమలనాథస్వామి కల్యాణోత్సవంలో పాల్గొనేందుకు కుటుంబంతో కలిసి వచ్చాడు. సోమవారం తిరిగి కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లాడు. మంగళవారం మళ్లీ పెద్దకాపర్తి గ్రామానికి వచ్చిన రాజు గ్రామంలోని తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో రాత్రి పది గంటల సమయంలో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి మృతుడి కుటుంబ సభ్యులతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. రాజు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని అతడి భార్య సద్గుణ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వేములపల్లి(మాడ్గులపల్లి): మద్యానికి బాని సైన వ్యక్తి ఎలుకల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాడ్గులపల్లి మండలం చిరుమర్తి గ్రామానికి చెందిన కొండ శ్రీను(35) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ సమయంలో ఎలుకల మందు తాగాడు. రాత్రి 8గంటలకు కూలీ పని నుంచి ఇంటికి వచ్చిన అతడి భార్య రాజేశ్వరితో తాను ఎలుకల మందు తాగానని చెప్పడంతో వెంటనే మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపా రు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

పురుగుల మందు తాగి..

చౌటుప్పల్: ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి తంగడపల్లికి చెందిన అంతటి జగన్(45) వ్యవసాయంతో పాటు బోర్‌వెల్ వ్యాపారంలో భాగస్వామిగా ఉన్నాడు. వ్యవసాయంతో పాటు వ్యాపారంలో నష్టం రావడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఈ నెల 2న తన పొలం వద్ద పురుగుల మందు తాగాడు. అతడిని హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

ఎమ్మెల్యేకు న్యూడ్ కాల్స్‌పై దర్యాప్తు వేగవంతం

- ఒకరిని అదుపులోకి తీసుకుని విచారణ
- కేసు సైబర్ క్రైంకు అప్పగింత

నకిరేకల్: నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు సైబర్ నేరగాళ్లు న్యూడ్ వీడియోకాల్ చేసి డబ్బులు ఇవ్వాలని బెదిరించిన కేసులో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ కేసులో ఎమ్మెల్యేకు వచ్చిన కాల్‌కు సంబంధించిన ఫోన్ నంబర్ మధ్యప్రదేశ్ నుంచి వచ్చినట్లు పోలీసులు నిర్ధారించారు.. నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు నకిరేకల్ సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ లచ్చిరెడ్డి, పోలీస్ కానిస్టేబుళ్లు వెంకటేశ్వర్లు, శ్రీను ఈ నెల 6న మధ్యప్రదేశ్ వెళ్లారు. అక్కడే నాలుగు రోజుల పాటు మకాం వేసి గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని డార్ జిల్లాలో ఒకరిని అదుపులోకి తీసుకుని మంగళవారం నకిరేకల్‌కు తీసుకొచ్చారు. ఆ వ్యక్తిని స్థానిక సీఐ రాజశేఖర్ జిల్లా సైబర్ క్రైం సిబ్బందికి అప్పగించారు. ఈ కేసుకు సంబంధించిన మిగతా వారిని కూడా పట్టుకున్న తర్వాత పూర్తి వివరాలు పోలీసులు వెల్లడించే అవకాశం ఉంది.

కుటుంబ కలహాలతో వృద్ధుడి ఆత్మహత్య

తిరుమలగిరి(నాగార్జునసాగర్): కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన వృద్ధుడు చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బుధవారం తిరుమలగిరి(నాగార్జునసాగర్) మండలం యల్లాపురం తండాలో జరిగింది. ఎస్‌ఐ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. యల్లాపురం తండాకు చెందిన కొర్ర నాను అలియాస్ బుగ్గా(70) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య, ఐదుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు సంతానం. కొంతకాలంగా వారి కుటుంబంలో తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన నాను బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి వెనుక వేపచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొద్దిసేపటి తరువాత చిన్న కుమార్తె సునీత గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా అప్పటికే మృతిచెందాడు. ఘటనా స్థలాన్ని సాగర్ సర్కిల్ సీఐ భీసన్న పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నాగార్జునసాగర్‌లోని కమలానెహ్రూ హాస్పిటల్‌కు తరలించారు. మృతుడి భార్య జాను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యూట్యూబర్‌పై కేసు నమోదు

నూతనకల్: బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తున్న యూట్యూబర్‌పై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ మహేంద్రనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. నూతనకల్ మండల కేంద్రానికి చెందిన భయ్యా సన్నీయాదవ్ బైక్ రైడ్స్ చేస్తూ వీడియోలు తీసి యూట్యూబ్‌లో పోస్ట్ చేస్తూ లక్షల మంది ఫాలోవర్స్‌ను సంపాదించాడు. అతడు తన సోషల్ మీడియా అకౌంట్స్‌లో బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తుండటంతో సుమోటోగా కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ స్పందిస్తూ.. బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తే ఊచలు లెక్కపెట్టక తప్పదని అన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

రామగిరి(నల్లగొండ): బాబాయి, పిన్నిని హత్య చేసిన నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ నల్లగొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. నాగరాజు బుధవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... డిండి మండలం చెర్కుపల్లి గ్రామానికి చెందిన మొకురాలు నిరంజన్, అతడి భార్య రాములమ్మ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి సంతానం లేరు. దీంతో తమ భూమిని అమ్ముకోవాలని నిర్ణయించుకున్నారు. అయితే నిరంజన్ దంపతులు చనిపోయిన తర్వాత వారి ఆస్తి తనకు దక్కుతుందన్న దురుద్దేశంతో నిరంజన్ అన్న కొడుకు మొకురాలు శేఖర్ వారిని భూమి అమ్ముకోనీయకుండా గొడవలు పడుతున్నాడు. 2019 మే 5వ తేదీన తమ పొలం వద్ద నిరంజన్, అతడి భార్య రాములమ్మ వ్యవసాయ పనులు చేసుకుంటుండగా.. మొకురాలు శేఖర్ మరో ఇద్దరితో కలిసి కత్తులతో వారిపై దాడి చేయడంతో నిరంజన్, రాములమ్మ అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడి బావమరిది చింతపల్లి వెంకటయ్య డిండి పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులను కోర్టులో హాజరుపరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి. శ్రీవాణి వాదనలతో ఏకీభవించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. నాగరాజు శేఖర్‌కు జీవిత ఖైదు రూ. 2 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. మరో ఇద్దరిపై నేరారోపణ రుజువు కాకపోవడంతో నిర్దోషులుగా తీర్పు ఇచ్చారు. ఈ కేసులో సరైన ఆధారాలు సేకరించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసి నిందితుడికి శిక్షపడేలా పనిచేసిన అప్పటి సీఐ డి. చంద్రశేఖర్ రెడ్డి, ఎస్‌ఐ కె. భాస్కర్‌రెడ్డి, ప్రస్తుత సీఐ ఎస్. సురేష్, ఎస్‌ఐ డి. రాజు, కానిస్టేబుల్ కె. కృష్ణ, లైజన్ ఆఫీసర్లు పి. నరేందర్, ఎన్. మల్లికార్జున్‌ను జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించారు.

ఐస్‌క్రీమ్ తయారీ కేంద్రంపై పోలీసుల దాడి

- నాసిరకం ముడిసరుకు స్వాధీనం

చౌటుప్పల్: చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని రాంనగర్‌కాలనీలో గల ఐస్‌క్రీమ్ తయారీ కేంద్రంలో నాసిరకం ఐస్‌క్రీమ్‌లు తయారు చేస్తున్నారని సమాచారం అందడంతో బుధవారం ఐస్‌క్రీమ్ తయారీ కేంద్రంపై ఎస్‌ఓటీ పోలీసులు అకస్మాత్తుగా దాడులు నిర్వహించారు. నాసిరకం ముడిసరుకు వినియోగించి ఐస్‌క్రీమ్‌లు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. నాసిరకం సరుకు స్వాధీనం చేసుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు నిర్వాహకుడు బోన భానుమూర్తి, తయారీదారుడు ముఖేష్‌కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రూ. 309 కోట్లతో అభివృద్ధికి ప్రతిపాదనలు

- ఎంజీయూలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి మరిన్ని కోర్సులు
- వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్
- యూనివర్సిటీని సందర్శించిన ఉన్నత విద్యామండలి ప్రొఫెసర్ల బృందం



ఎంజీయూ ఆవరణను పరిశీలిస్తున్న ఉన్నత విద్యామండలి ప్రొఫెసర్ల బృందం

నల్లగొండ టూటౌన్: వచ్చే విద్యా సంవత్సరం నుంచి మహాత్మాగాంధీ యూనివర్సిటీలో మరిన్ని కోర్సులు ప్రవేశపెట్టడానికి, అదనపు భవనాల నిర్మాణం, అధ్యాపకుల నియామకంతో పాటు ఇతర అభివృద్ధి పనుల కోసం రూ.309.65 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో ప్రొఫెసర్లు విద్యాధర రెడ్డి, మృణాళిని, శోభారాణి బృందం బుధవారం ఎంజీయూను సందర్శించి పలు భవనాలను, సదుపాయాలను పరిశీలించారు. పానగల్ క్యాంపస్‌ను సందర్శించి అక్కడ ఇంజనీరింగ్ కళాశాల, స్పోర్ట్స్ కాంప్లెక్స్ గురించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు వీసీ తన చాంబర్‌లో అభివృద్ధి ప్రతిపాదనలను, యూనివర్సిటీ స్థితిగతులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి వివరించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం, బీఈడీ, ఎంఈడీ, బీపీఈడీ, ఎంపీఈడీ, ఎంఏ గవర్నర్స్ అండ్ పబ్లిక్ పాలసీ, ఎంఏ డెవలప్‌మెంట్ స్టడీస్, బీఫార్మసీ కోర్సులను ప్రవేశపెట్టాలని నిర్ణయించినట్లు వీసీ తెలిపారు. నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏర్పాటు చేస్తామని ప్రొఫెసర్ల బృందానికి వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అల్వాల రవి, ఓఎస్‌డీ కొప్పుల అంజిరెడ్డి, డెవలప్‌మెంట్ డైరెక్టర్ ఆవుల రవి, దోమల రమేష్, ఆడిట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ వై. ప్రశాంతి, ప్రిన్సిపాల్స్ సుధారాణి, కె. ప్రేమ్‌సాగర్, హరీష్‌కుమార్, సీఓఈ ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగిని బ్లాక్‌మెయిల్ చేసి..

- డబ్బులు వసూలు చేసిన ఇద్దరు నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు

మిర్యాలగూడ అర్బన్: అటవీశాఖ రిటైర్డ్ ఉద్యోగిని బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు వసూలు చేసిన ఇద్దరు నిందితులను మిర్యాలగూడ టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను బుధవారం మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి(సాగర్) మండలం గట్టుమీదితండాకు చెందిన ఆంగోతు గణేష్, ఎల్లాపురం తండాకు చెందిన కుర్ర శంకర్ వరసకు బావబావర్దులు. గణేష్‌కు మిర్యాలగూడకు చెందిన అటవీశాఖ రిటైర్డ్ ఉద్యోగి పరిచయమయ్యాడు. సదరు రిటైర్డ్ ఉద్యోగి వృద్ధాప్యంలో తనకు కేర్ టేకర్‌గా గణేష్‌కు పెట్టుకున్నాడు. అయితే రిటైర్డ్ ఉద్యోగి వద్ద ఉన్న డబ్బులను కాజేయాలని గణేష్ పథకం రచించాడు. ఎలాగైనా అతడి పరువుకు నష్టం కలిగించి బెదిరించి డబ్బులు గుంజాలని గణేష్ అనుకున్నాడు. 2022 జూన్ 11న అటవీశాఖ రిటైర్డ్ ఉద్యోగి, గణేష్ పని నిమిత్తం సూర్యాపేటకు వెళ్లారు. పథకం ప్రకారం రిటైర్డ్ ఉద్యోగికి గణేష్ ఎక్కువగా మద్యం తాగించాడు. అతడు స్పృహతప్పిన తర్వాత గుర్తుతెలియని మహిళకు డబ్బు ఆశచూపి సదరు రిటైర్డ్ ఉద్యోగితో ఆమెను కలిపి అసభ్యంగా ఫొటోలు, వీడియోలు తీశాడు. కొద్దిరోజుల తర్వాత ఆ ఫొటోలు వీడియోలు రిటైర్డ్ ఉద్యోగికి పంపిన గణేష్ డబ్బులు ఇవ్వాలని బ్లాక్‌మెయిల్ చేయడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో 2022 నుంచి 2024 వరకు 19 ప్రామిసరీ నోట్లపై సంతకాలు పెట్టించుకున్నాడు. ఆ ప్రామిసరీ నోట్లను రిటైర్డ్ ఉద్యోగి కుమార్తె, అల్లుడికి చూపించి అసలు వడ్డీతో కలిసి రూ.46 లక్షలు తీసుకున్నాడు. గణేష్‌కు అతడి భార్య, బావమరిదికి శంకర్ సహకరించడంతో మళ్లీ బ్లాక్‌మెయిల్ చేయసాగాడు. దీంతో బాధితుడు రూ.2.55లక్షలు ఫోన్‌పే ద్వారా ట్రాన్స్‌ఫర్ చేశాడు. అయినా వారి వేధింపులు ఆగకపోవడంతో చివరకు కుటుంబ సభ్యులకు విషయం చెప్పాడు. దీంతో బాధితుడి కుటుం సభ్యులు మిర్యాలగూడ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు బుధవారం గణేష్, అతడి బావమరిది శంకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి కారు, 4.5 తులాల బంగారం (ముత్తూట్ ఫైనాన్స్‌లో ఉంది), స్మార్ట్‌ఫోన్, 10 ఒరిజనల్ ప్రామిసరీ నోట్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. గణేష్‌పై విజయపురి టౌన్, తిరుమలగిరి(సాగర్), వాడపల్లి పోలీస్ స్టేషన్లలో ఆరు కేసులు ఉన్నాయని, పదేపదే నేరాలకు పాల్పడుతున్న అతడిపై రౌడీషీట్ తెరుస్తామని డీఎస్పీ పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మిర్యాలగూడ టూటౌన్ సీఐ నాగార్జున, ఎస్‌ఐలు డి. హరీష్‌రెడ్డి, బి. రాంబాబు, కానిస్టేబుళ్లు పి. బాలకృష్ణ, కళ్యాణ్, అక్బర్, రామకృష్ణ, రమేష్‌నాయక్, సూర తదితరులు పాల్గొన్నారు.

కష్టపడ్డారు.. ‘గ్రూప్స్’ సాధించారు



లక్ష్మణ్ వర్మ



వినయ్‌రావు



మాలోతు తేజ



అనిల్‌కుమార్



రాజశేఖర్‌రెడ్డి



రచ్చ పవన్‌కుమార్

ఉమ్మడి నల్లగొండ జిల్లాకు పలువురు గ్రూప్‌–2 ఫలితాల్లో సత్తా చాటి ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

కలకోవ వాసికి 29వ ర్యాంకు

మునగాల: గ్రూప్‌–2 ఫలితాల్లో మునగాల మండలం కలకోవ గ్రామానికి చెందిన గుండు లక్ష్మణ్‌వర్మ రాష్ట్రస్థాయిలో 29వ ర్యాంకు సాధించారు. గతంలో చెన్నైలో ఆదాయ పన్ను శాఖలో పనిచేసిన ఆయన.. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్‌–4 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 21వ ర్యాంకు సాధించి కోదాడ ఆర్డీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇప్పుడు గ్రూప్‌–2 ఫలితాల్లో 29వ ర్యాంకు సాధించాడు.

ఇటుకులపహాడ్ వాసికి 60వ ర్యాంకు

శాలిగౌరారం: మండలంలోని ఇటుకులపహాడ్ గ్రామానికి చెందిన రచ్చ శ్రీనివాస్‌–తిరుమలేశ్వరి దంపతుల కుమారుడు రచ్చ పవన్‌కుమార్ గ్రూప్‌–2 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 60వ ర్యాంకు సాధించాడు. గతంలో టీసీఎస్ కంపెనీలో రూ.3.40లక్షల వార్షిక ప్యాకేజీతో సాఫ్ట్‌వేర్‌గా ఉద్యోగం చేసిన అతడు గత డిసెంబర్‌లో ప్రకటించిన గ్రూప్‌–4 ఫలితాల్లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించి పీఏపల్లి తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఉద్యోగం చేస్తూనే గ్రూప్స్‌కు ప్రిపేరైన పవన్‌కుమార్ ఇటీవల ప్రకటించిన గ్రూప్‌–1 ఫలితాల్లో 434 మార్కులు సాధించగా.. గ్రూప్‌–2లో 60వ ర్యాంకు సాధించారు. ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా ఆన్‌లైన్, యూట్యూబ్‌లో క్లాస్‌లు విని ప్రిపేరయ్యాని, సివిల్స్ సాధించడమే తన లక్ష్యమని పవన్‌కుమార్ పేర్కొన్నారు.

80వ ర్యాంకు సాధించిన డిండి మండల వాసి..

డిండి: డిండి మండలం రుద్రాయగుడెం గ్రామానికి చెందిన పోనుగోటి వినయ్‌రావు గ్రూప్‌–2 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 80వ ర్యాంకు సాధించారు. వినోద్ రావుకు ప్రభుత్వ ఉద్యోగం రావడం పట్ల గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

135వ ర్యాంక్ సాధించిన రాజశేఖర్‌రెడ్డి

హుజూర్‌నగర్ (చింతలపాలెం): చింతలపాలెం మండల కేంద్రానికి చెందిన గంగిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి గ్రూప్‌–2 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 135వ ర్యాంకు సాధించారు. ఆయన 2018లో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికై ప్రస్తుతం హైదరాబాద్‌లోని జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన పెద్ద తమ్ముడు గోవిందరెడ్డి 2020లో అంబర్‌పేట్‌లోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్‌ఐగా, చిన్న తమ్ముడు విజయ్‌భాస్కర్‌రెడ్డి హైదరాబాద్‌లోని నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్నారు.

కీతవారిగూడెం వాసికి 301వ ర్యాంకు..

గరిడేపల్లి: గ్రూప్‌–2ఫలితాల్లో గరిడేపల్లి మండలం కీతవారిగూడెం గ్రామానికి చెందిన గుండు అనిల్ కుమార్ రాష్ట్రస్థాయిలో 301వ ర్యాంకు సాధించాడు. అనిల్‌కుమార్ ప్రస్తుతం పులిచింతల పవర్ హౌజ్‌లో జేపీఏగా పనిచేస్తున్నాడు. తన విజయానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువుల మార్గదర్శనం, స్నేహితుల సహాయమే కారణమని ఆయన పేర్కొన్నారు.

బురుగులతండా వాసికి 512వ ర్యాంకు..

నేరేడుచర్ల: నేరేడుచర్ల మండలం బురుగులతండాకు చెందిన మాలోతు తేజ మంగళవారం వెలువడిన గ్రూప్‌–2 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో జనరల్ కేటగిరీలో 512 ర్యాంకు.. ఎస్టీ కేటగిరీలో 20వ ర్యాంకు సాధించాడు. మారుమూల గిరిజన తండాకు చెందిన తేజ గతంలో రైల్వే శాఖలో రెండు ఉద్యోగాలు సాధించాడు. అనంతరం స్టాఫ్ సెలక్షన్ కమిషన్‌–కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ పరీక్షలో కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్‌గా ఎంపికై ప్రస్తుతం కేరళలో ఉద్యోగం చేస్తూనే గ్రూప్‌–2కు ప్రిపేర్ అయ్యి మంచి ర్యాంకు సాధించాడు.

గ్రూప్‌–1 ఉద్యోగానికి ఎంపిక



ముడుసు శ్రీకాంత్

గుర్రంపోడు: గుర్రంపోడు మండలం జిన్నాయిచింత గ్రామానికి చెందిన ముడుసు శ్రీకాంత్ చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి పట్టుదలతో చదివి గ్రూప్‌–1 ఫలితాల్లో 600 మార్కులకు గాను 475 మార్కులు సాధించాడు. తన ర్యాంకును బట్టి డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం వస్తుందన్న ఆశాభావాన్ని శ్రీకాంత్ వ్యక్తం చేశారు. ప్రస్తుతం పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తున్న ఆయన పాఠశాల స్థాయిలో గురువులు నేర్పిన క్రమశిక్షణతోనే ఈ స్థాయికి ఎదిగానని చెప్పారు.